682) సాళంగనాట

ప॥ మొక్కరో మొక్కరో వాడె ముందర నిలుచున్నాడు । యెక్కువ రాముని బంటు యేకాంగవీరుడు ॥

చ॥ పెట్టిన జంగ తోడి పెద్ద హనుమంతుడు । పట్టెను యెడమచేతి బలుముష్టి ।
మెట్టినాడు పాదముల మించు రాకాశితలలు । కొట్టేననుచు నెత్తె గొప్ప వలకేలు ॥

చ॥ వంచెను శిరసుమీద వాలుగా దనతోక । పెంచెను మిన్నులుమోవ పెనుదేహము ।
నించినాడు రౌద్రము నిడుపాటిదవడల । కాంచనపు పుట్టుకాళ కడు బిగించెను ॥

చ॥ పెరచి తొడలుదాక పెద్దపదకము వేసె । తనువుపై వేలాడేదండలతోడ ।
అనయము శ్రీవేంకటాద్రి దేవునిబంటు । వెనుబలమై యున్నాడు విట్ఠలములోనను ॥